

# తల్లి

వేదాచలం పదిహేను రోజుల ఆఫీసు టూరు ముగించుకుని ఆ రోజే తిరిగి వచ్చాడు. అతను అన్ని రోజులు బయట వున్నా అతని దృష్టి అంతా భార్య పుణ్యశీల మీదే వుంది. అతనేం కొత్త పెళ్ళికొడుకు కాదు. ఆరేళ్ళ కొడుకు కూడా వున్నాడు. వాళ్ళ వివాహం జరిగి ఎనిమిది సంవత్సరాలు అయింది. అయినా కూడా ఆ భార్యాభర్తలు ఒకర్ని విడిచి ఒకరు వుండలేనంతగా ప్రవర్తిస్తారంటే అందుకు కారణం ఆ ఇద్దరి మధ్యా అనురాగలత బలంగా పెనవేసుకుని వుండడమే. ఆ దాంపత్య జీవితంలో ప్రేమ గంధం ఇంకా ఆరిపోకపోవడమే.

అతను స్టేషన్లో దిగేసరికి ఉదయం పది గంటలు అయింది. అతని దగ్గర ఎక్కువ సామాను లేదు కనుక తేలిగ్గా సిటీ బస్‌లో ఇంటికి వెళ్ళొచ్చు. అయినా ఆలస్యం భరించలేక వెంటనే ఒక ఆటో మాట్లాడుకుని అందులో కూలబడ్డాడు. కళ్ళు మూసుకున్నా, తెరచుకుని వున్నా భార్య తాలూకు అందాల ముఖం అతని కళ్ళ ముందు కనబడుతూ అతన్ని కవ్విస్తోంది. దానికి తోడు గత రాత్రి అతను చూసిన ఇంగ్లీషు రొమాంటిక్ సినిమా తాలూకు హేంగోవర్ అతన్ని వదల్లేదు.

ఇంటి ముందు దిగి ఆటోను పంపి తలుపు తట్టాడు వేదాచలం.

తలుపు తీసింది పుణ్యశీల. అప్పుడే స్నానం చేసి, ఇస్త్రీ చీర కట్టుకుని వచ్చిందేమో ఆమె మంచులో తడిసిన గులాబీలాగా, కడిగిన ముత్యం లాగా మిలమిలలాడుతూ కనిపించింది. ఆమెను చూస్తూనే చిన్నగా, హుషారుగా ఈల వేశాడు.

"రండి..." అంటూ సంతోషంగా ఆహ్వానించింది.

"ఏమిటి సంగతి.. రెట్టించిన అందంతో మిలమిలలాడిపోతున్నావు" అన్నాడు లోపలకు వస్తూ.

ఆమె తలుపు గడియపెట్టింది.

ఆమెను దగ్గరకు తీసుకుని చెంప మీద ముద్దు పెట్టుకున్నాడు.

"ష్..రాకేష్ వున్నాడు.." అంది ఆమె చిన్నగా.

"ఏం? స్కూలుకి వెళ్ళలేదా?" అడిగాడు.

"ఈ రోజు ఆదివారం మహానుభావా" అంది నవ్వుతూ.

ఆ తర్వాత గొంతు పెంచి లోపల్నుంచి కొడుకుని పిలిచింది.

"రాకేష్.. నాన్నగారు వచ్చారు బాబూ..."

పరుగులాంటి నడకతో రాకేష్ వచ్చాడు. తండ్రిని చూసిన సంతోషంతో అతని దగ్గరకు వచ్చి గట్టిగా వాటేసుకున్నాడు.

రాకేష్‌ని ఎత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు వేదాచలం.

"ఏం బాబూ..బాగున్నావా?"

తల ఊపేడు రాకేష్,

"ఆ ..ఏం బాగులెండి" అంది పుణ్యశీల.

"ఏం?"

"మూడు రోజులుగా జ్వరం..నిన్ననే పథ్యం తిన్నాడు."

తల ఆడించాడు వేదాచలం.

"మందులు వాడేవా? డాక్టరు ఏమన్నాడు? మలేరియా జ్వరమా?" ఆత్రంగా అడిగాడు.

రెండు పేజీలలో వున్న సగం వృత్తాన్ని ప్రక్కన వున్న విధంగా బొమ్మని కలుపుతూ రెండు పేజీలను ఏకంచేయండి. బొమ్మ పూర్తి స్వరూపాన్ని మీరు చూస్తారు.

# పాలకూర సీతాలత

"నాదాను.. మామూలు జ్వరమే" అంది పుణ్యశీల.

కొడుక్కి ఆడుకోమని చెప్పి పెట్టె తెరిచాడు. అందులో పుణ్యశీల కోసం కొన్న చీర, కొడుకు కోసం కొన్న ఆట బొమ్మలు వున్నాయి. కొడుకుని పిలిచి ఆ బొమ్మలు ఇచ్చాడు. భార్యకు ఆ చీర అప్పుడే ఇయ్యాలా, వద్దా అని ఆలోచించి ఇయ్యకూడదన్న నిర్ణయానికి వచ్చి పెట్టె మూశాడు.

అవును.. ఆమెకు చీర ఇప్పుడు చూపించకూడదు. రాత్రి అయ్యాక, బాబు పడుకున్నాక ఏకాంతంలో ప్రేమానురాగాల జల్లుల మధ్యన...

భార్యను ఆట పట్టించాలని తోచింది అతనికి.

"నీ కోసం ఏమీ తీసుకురాలేకపోయానోయ్" అన్నాడు.

పుణ్యశీల మామూలుగానే అంది "పోన్లెండి. ఫర్వాలేదు."

చిన్నగా నవ్వుకున్నాడు. ఎంత మంచిది తన భార్య.

"అక్కడ నవక అన్నారు కదా.. మీ కోసం రెండు జతల బట్టలు కొనుక్కోవల్సింది" అంది.

ప్రేమపూర్వకంగా భార్యవైపు చూశాడు. అతను తన కోసం బట్టలు తెచ్చుకోలేదు. అందుకు కారణం డబ్బులు మిగలకపోవడం.

ఎంత ఉత్తమురాలు తన భార్య! ఆమె కోసం ఏమీ తీసుకురాలేదని తను చెప్పినా ఏమీ అనుకోలేదు సరికదా తన కోసం రెండు జతల బట్టలు ఎందుకు తీసుకోలేదని అడుగుతోంది.

"పుణ్యా.." అన్నాడు అభిమానంగా.

"సరే.. పదండి. ముందు స్నానం చెయ్యండి. భోజనం సిద్ధం చేస్తాను. ప్రయాణంలో అలిసిపోయివుంటారు. వేడి వేడిగా నాలుగు మెతుకులు తిని నిద్రపోండి. బడలిక అంతా మాయం అవుతుంది" అంటూ లోపలకు నడిచింది పుణ్యశీల.

స్నానం చేస్తూ ఆలోచించాడు.

కారణం ఏమిటో తెలియదుగానీ ఈ రోజు పుణ్యశీలలో ఏదో కొత్త అందం కనపడుతోంది. తను చాలా రోజులుగా దూరంగా వుండడం వల్లనేమో! రాకేష్ ఇంట్లో వుండకుండా ఏ స్కూలుకో వెళ్ళివుంటే ఈ పగలే ఆ అందంతో ఆడుకుని వెన్నెల కురిపించివుండేవాడు. పోనీ.. ఇప్పుడయినా మించిపోయింది ఏముంది కనుక.. ఈ రోజు రాత్రి ఎలాగూ స్వర్గసుఖాలు అందుకోబోతున్నాడు కదా..

స్నానం ముగించి వచ్చేసరికి పుణ్యశీల వంట అయిపోయిందని చెప్పింది. ఉదయం టిఫిన్ సరిగ్గా తినలేదు. కడుపులో ఆకలిగా వుంది. అందుకే ఆలస్యం చెయ్యకుండా భోజనం చేశాడు రాకేష్‌తోపాటు.

పుణ్యశీల భోజనం చేస్తూంటే హాల్లో కూర్చుని పేపరు తిరగేయసాగాడు వేదాచలం.

అప్పుడే తలుపు చప్పుడైంది. వెళ్ళి తీశాడు.

ఎదురుగా టెలిగ్రాం మెసెంజర్. ఒక టెలిగ్రాం అందించి వెళ్ళిపోయాడు.

చదివాడు.

తన చెల్లెలు వస్తోంది ఈ రోజు. రాత్రి ఏడు గంటలకు స్టేషన్‌కి వచ్చి రిసీవ్ చేసుకోమని కబురు.

వేదాచలంకి చాలా ఆనందం కలిగింది. ఎన్నాళ్ళ నుంచో అతను చెల్లెల్ని, బావగార్ని తమ ఊరు వచ్చి ఒక్క పది రోజులు వుండమని పోరుతున్నాడు. ఇన్నాళ్ళకు కుదిరిందన్నమాట.

"ఎవరండీ?" అంది పుణ్యశీల చేతులు తుడుచుకుంటూ వచ్చి.

"మా చెల్లెలు.." అన్నాడు వేదాచలం.

"చెల్లెలా.. ఎక్కడ?" అంది ఆశ్చర్యంగా.

"చెల్లెల్లు అంటే చెల్లెలు కాదోయ్.. చెల్లెలు ఇచ్చిన టెలిగ్రాం. అది ఈ రోజు వస్తోంది. రాత్రి ఏడు గంటలకు స్టేషన్‌కు వెళ్ళాలి."

పుణ్యశీల సంతోషించింది.

"బాగుంది. మీ టూరు అయిపోయిన తర్వాతే ఆమె వస్తోంది చక్కగా. మీరు లేకపోతే ఆమె బాధపడేది" అంది పుణ్యశీల.

ఏదో గుర్తువచ్చినవాడిలా ఒక అర నిముషం ఆలోచించి ఆ తర్వాత ముఖం నిచారంగా పెట్టేడు.



(ముగింపు వచ్చే సంచికలో)